
# ఊగిసలోడు

ఆర్.రాఘవరెడ్డి



వాడ్నందరూ 'ఊగు లోడు' అంటున్నారంటే అవకేంజేస్తారు. అది చిన్న పని గానీ, పెద్ద పని గానీ... ఒక పట్టాన తెగనియ్యడు, తెల్లారనియ్యడు. ఏ విషయ మైనా సరే, ఎట్టాంటి నిర్ణయమైనా సరే ఎనక్కీ ముందుకీ, ముందుకీ ఎనక్కీ ఊగిసలాడతానే ఉంటాడు.

వారం రోజుల కిందటొకరోజు ఎప్పుట్లాగనే గొడుగు, నీళ్ళసీసా తీసుకోని బరెగొడ్లిప్పుకోని చేనుకి పోతన్నాడు. మిట్టచేను దాటాడు. అల్లంత దూరంలో ఎనికపాటోళ్ళ ఏపచెట్టుందనంగా ఎనకనించెవరో తోసినట్టు ముందుకి తూలాడు. మందు ఎక్కువైనోడిలాగా తూలుకుంటా తూలుకుంటా రెండడుగులేసి గెనెం మీద ఆమేన కూలబడ్డాడు.

# వేదుల చిన్న వేంకట చయనులు - నవ్యవీక్లి కథల పోటీలో

# తృతీయ బహుమతి రూ. 5,000 పొందిన కథ

చెట్టు నీడన కూర్చోనున్న రాజయ్య ఇది చూసి పరుగెత్తుకుంటా వచ్చాడు. ''ఏమైందిరా..వచ్చే వచ్చే వాడివి అట్టా కూలబడిపొయ్యావు..'' అంటా పైకి లేపి బుగ్గలు తట్టాడు. ఊగులోడు కళ్ళు తెరిచి పైకి లేచి రెండడుగులు ముందుకేసి మళ్ళీ పడిపోయాడు. దూరంగా కాలవకట్టన గొడ్లు మేపుకుంటన్నోళ్ళు కూడా వచ్చి చుట్టూ మూగారు. ఊగులోడ్ని మోసుకొచ్చి చెట్టు నీడన పడుకోబెట్టారు. ముఖాన కాసిని నీళ్ళు జల్లారు.

కాసేపటికి కళ్ళు తెరిచాడు. ''ఏంది మాఁవా'', ''ఏందిరా'', ''ఎట్టాగుందిరా'' అందరూ ఒకేసారి ఆదుర్దాగా అడుగుతున్నారు. ఎవరో మంచినీళ్ళు తెచ్చిచ్చారు. రెండు మూడు గుటకలేశాడు. అంతలోనే లేచి పక్కకొచ్చి వాంతి చేసుకున్నాడు. ''కళ్ళకేమీ అగపడ్డం లేదు... అంతా తెల్లగా బూజరగా ఉంది'' అంటా కూర్చుండిపోయాడు.

'కూడు తినకుండా పొలం బయలుదేరాడేమో', 'నీరసమ్మీద కళ్ళు తిరిగినట్టుంది', వాతం కమ్మినట్టుంది'.. తలా ఒక రకంగా ఊహిస్తున్నారు. రాజయ్య సీసాలోని చల్లటి నీళ్ళు తెచ్చి మొహం కడిగాడు.

''ఇప్పుడు కనపడతందంట్రా?'' ''కనపడతంది మాఁవా'' ఊగులోడు నీరసంగా చెప్పాడు.

మాయిటేళ ఇంటికి పొయ్యేటప్పుడు జొన్నకోసుకెళ్ళాలని బండికట్టుకోనొచ్చిన సుబ్బారెడ్డిని కేకేశారు. గెనాల మీద ఎగిరెగిరిపడతా బండి ఊళ్ళోకి వేగంగా పోతంది. ఊగులోడి గుండె అంతకన్నా ఎక్కువగానే ఎగిరెగిరి పడతా ఉంది. అంతకన్నా వేగంతోనే కొట్టుకుంటా ఉంది.

ఊగులోడికసలే భయమెక్కువ. ఏ చిన్న సమస్య వచ్చినా కంగారు పడిపోతాడు. ఇట్టయిద్దేమో అట్టయిద్దేమో అని అవకముందే బెంబేలు పడుతుంటాడు. ఇప్పుడిట్లా తూలుడొచ్చి పడిపోవడానికి కారణమేందో అర్థం కాక గుబులు పట్టుకుంది. జెరం, గిరం ఏమీలేకపోయె, కనీసం తలకాయనొప్పి కూడా లేకపోయె. ఇప్పుడు ఉన్నట్టుండి ఇట్టా ఎందుకయినట్టు? కొంపదీసి ఫిట్సేమో.....? ఆ మాట అనుకోటానికే భయం పుట్టింది.


తనకిష్టంలేని, మనసుకి కష్టం కలిగించే సంగతుల్ని గుర్తుకు తెచ్చుకోవడం కూడా ఇష్టముండదు ఊగులోడికి. వాటిని కావాలనే మర్చిపోతాడు. జ్ఞాపకాల పెట్టెలో ఎక్కడో అట్టడుక్కి వాటిని తోసేస్తాడు. ఎప్పుడన్నా ఆ ఆలోచనలొచ్చినా... ఎంబట్నే మనసుని మరేదో విషయం మీదకి మళ్ళించేస్తాడు.

అయితేఒక్కోసారి కొన్ని ఆలోచనలు ఎదురు తిరుగుతాయి. ఏం వద్దనుకుంటాడో అవే గుర్తుకొస్తుంటాయి. ఆ రాత్రీ అట్లానే జరిగింది ఊగులోడికి. ''ఛ! మనకేం లేదులే. మూర్ఛలేదు, ఏం లేదు. అదయితే నోటెంట నురుగు రావటం, గుప్పిళ్ళు బిగబట్టడం ఉంటై గదా. ఏదో, మామూలుగా కళ్ళు తిరిగినయ్యంతే'' అని తనకు తాను చెప్పుకుని పడుకున్నాడు. కానీ నిద్రపడితేగా. రాత్రంతా ఏదో గుబులు.

తనూ నిద్రపోలేదు. తన భార్యనీ నిద్రపోనియ్యలేదు. ఆ పిల్ల పెళ్ళయిన పదేళ్ళుగా ఊగులోడి యవ్వారం చూస్తానే ఉంది. పిల్లల్లేరనేగానీ మొగుడే ఒక చిన్న పిల్లోడా అమ్మాయికి. నిజానికి ఊగులోడు చానా తెలివైనోడు. ఏ విషయమైనా సరే విభజించీ విడగొట్టీ పీసు పీసు జేసి పాయింట్లు లాగుతుంటాడు. వీడి 'లా' పాయింట్లకి జవాబు చెప్పలేక 'ఒట్టి పెడనాయాల్రా ఈడు' అంటుంటారు ఊళ్ళోవాళ్ళు.

చిన్నప్పుడే నాన్న చనిపోయినా పొలం పనులన్నీ అమ్మే చూసుకుంటా బడికి పంపించింది. పక్కూళ్ళో హైస్కూలుకి రోజూ పదిమైళ్ళు నడిచి వెళ్ళొచ్చేవాడు. బాగా చదివేవాడు. పదో తరగతి స్కూలు ఫస్టొచ్చాడు కూడా. పరీక్షలు జరుగుతుండగానే అమ్మకి జబ్బుచేసి ఆసుపత్రిలో చేరడం, తరువాత ఆమే చనిపోవడంతో ఊగులోడి చదువాగిపోయింది. నాలుగేళ్ళపాటు తనింట్లోనే పెట్టుకుని కూతుర్నిచ్చి పెళ్ళి చేశాడు మేనమామ. పెళ్ళినాటికి ఊగులోడికి నిండా ఇరవై కూడా లేవు. ఆ పిల్లకి మైనార్టీ కూడా తీరలేదు. 'మీ నాన్నని ఇప్పుడైనా అరెస్టు చేయించొచ్చు ఈ పాయింటు మీద'' అని అప్పుడప్పుడు ఆ పిల్లని ఆటపట్టిస్తుంటాడు.

ఆ అమ్మాయి తనంత తెలివయింది కాదని ఊగులోడి అభిప్రాయం. కానీ ధైర్యంలో మాత్రం తనకంటే పది రెట్లు మేలని వాడికి ఖచ్చితంగా తెలుసు. ఒకటికి మించిన మార్గాలున్న సమస్య ఏదైనా వచ్చిందా.. ఊగులోడికి చచ్చేచావొచ్చిందన్న మాటే. అసలు ముందు కాసేపు ఏం



తోచదు. బ్లేడు లాగిన మడిచెక్కలాగా మైండంతా ఖాళీగా అయిపోద్ది. అట్లా చెయ్యాలా ఇట్లా చెయ్యాలా అని అట్లా ఇట్లా కాదు.. మూడు పొద్దులు, మూడు రాత్రులు అదే పనిగా ఆలోచిస్తానే ఉంటాడు.

ఈ లోపు ముప్ఫైమూడుసార్లు 'ఏం చేద్దామంటావే' అని భార్యనడుగుతాడు. ఆ అమ్మాయికి తెలిసిన విషయాల్లో ఆమె సలహాలడుగుతాడు. తెలియని విషయాల్లో కూడా అట్లానే అడుగుతాడు. 'నీ ఇష్టం' అంటేనేమో ''నా ఇష్టం సరే, నీ ఇష్టమేందని గదా అడుగుతుంది. నీకొక అభిప్రాయముండదా..'' అంటా 'లా' పాయింట్లు దీస్తాడు. సరే... ఏదో తనకు తోచింది చెబుతుందా, 'అట్టెట్టయిద్ది, ఇట్టెట్టయిద్ది' అని మళ్ళా తగులుకుంటాడు. ఆ అమ్మాయి చెప్పినట్లు చేసి ఆ పని కొంచెం అటూ ఇటూ అయిందంటే ''ఛ..నువ్వట్లా చెప్పబట్టిగదా ఇప్పుడిట్లా అయింది'' అని కొన్ని రోజుల పాటు సణిగినోడు సణిగినట్టే ఉంటాడు.

ఉదయం చేనికాడ తను పడిపోవడం గురించి కూడా తనకు తోచిన రక రకాల భయాలన్నీ పెళ్ళాంతో చెప్పాడు. అన్నిట్నీ కొట్టిపారేసిందా పిల్ల. ''పొట్టలో బాగలేదని పొద్దున్నే ఏం తిన కుండా పొలం బోతివి.. చిరచిరలాడే ఎండకి కళ్ళు తిరిగి పడిపొయ్యావంతే'' అని ఎప్పట్లాగానే ఊగులోడికి ధైర్యమిచ్చింది.

'అంతే అంతే' అనుకోని కళ్లు మూసుకుని పడుకుంటాడు. అంతలోకే సీసాలోంచి భూతం బయటకొచ్చినట్టు ఏదో ఒక అనుమానం. భార్యని లేపుతాడు. ''మరి..కళ్ళకేమీ అగపడ కుండా తెల్లగా బూజరగా ఉండటమేంది ఒక నిమిషం సేపు?'' నీరసమ్మీద పడిపోతే అట్లాగే ఉండిద్దిలే..'' ''ఛ.. స్పృహ తప్పి పడిపోవటానికీ, కళ్ళు కనపడకపోవటానికీ సంబంధమేందే...?'' – ఆమె తన పాత జవాబే మళ్ళీ ఇంకాస్త గట్టిగా చెబితే వినాలని వాడి కోరిక. ఆ అమ్మాయి గోడమీద టైం చూసి వాడివైపు తిరిగి ఆవులిస్తూ ''సరే, రేపు ఒంగోలు.. డాక్టరు దగ్గరకి వెళ్దాంలే'' అంది. ''ఛ! డాక్టరు దగ్గరకెందుకే.. వాళ్ళు ఏదేదో చెబుతారు. ఏదో కళ్ళు తిరిగుంటయ్యంతేలే. పడుకో పడుకో.. అర్ధరాత్రి అవతంది'' అంటా పడుకున్నాడు.

తెల్లారిలేచి గుబులు గుబులుగానే బరగొడ్లకాడ బాగుచేశాడు. భార్య పాలు పిండింది. పోయి కేంద్రానికి పోసొచ్చాడు. నాలుగు రోజులు గడిచిపోయినయ్. ఏమవుద్దో ఏమవుద్దో నన్న భయం కాస్త తగ్గుతా ఉంది. ఎంబట్నే కంగారుపడి ఆసుపత్రికి పరుగెత్తనందుకు సంతోషిస్తున్నాడు.

ఆ రోజు పాల కేంద్రంకాడ అరుగు మీద కూర్చోని పేపరు చదువుతున్నాడు. లోపలెక్కడో అంతరాత్మలో అణిచిపెట్టుకున్న భయం పేపర్లో ఆ వార్త చూసి చప్పున పైకి తన్నుకొచ్చింది. ఆ రోజు ప్రపంచ మూర్ఛ రోగుల దినమంట! ఆ సందర్భంగా ఎవరో డాక్టరు ఆ రోగం గురించి పేపర్లో రాశాడు. నోటంబడి నురుగులు రావడం, గుప్పిళ్ళు బిగబట్టడం లాంటి లక్షణాలు లేకుండా కూడా ఫిట్స్ రావొచ్చంట. కొద్ది సమయం పాటు కళ్ళకేమీ అగపడకుండా ఉండటం కూడా మూర్ఛ లక్షణాల్లో ఒకటంట.

ఒక్కసారిగా ఊగులోడి వాలకమే మారిపోయింది. ఉషారుగా పేపరు తీసుకున్నోడల్లా చప్పున చల్లారిపొయ్యాడు. మెదలకుండా పేపరు మడతేసి అక్కడ పెట్టి ఇంటికి బయలు దేరాడు. అలవాటయిన దారిగుండా అలవాటయిన కాళ్ళు ఇంటికేసి సాగిపోతన్నయ్యేగానీ, ఊగులోడి మనసులో ఏడేడు సముద్రాలు ఎగిరెగిరి పడుతున్నాయి.

ఇంటికొచ్చేసరికి భార్య పేపరు చదువుతా ఉంది. ఊగులోడిని చూసి చదివే చదివే పేపరు మడిచేసి పక్కింట్లో ఇచ్చేసొచ్చింది. ఒళ్ళంతా చెమట్లు పట్టిన మొగుణ్ణి చూసి ఏందట్లా ఉన్నావని అడిగింది. పేపర్లో తను చదివిన వ్యాసం గురించి చెప్పాడు. ఊగులోడు వచ్చేసరికి తనూ పేపర్లో చదువుతున్నది ఆ వ్యాసమేనని, అది చూస్తే ఇంకా కంగారు పడతాడేమోనని హడావుడిగా వాళ్ళ పేపరు వాళ్ళకి ఇచ్చొచ్చాననీ చెప్పింది.

నిజానికా వ్యాసంలో ఫిట్స్ అంటే ఇప్పుడు భయపడాల్సిందేం లేదని, మందులు వాడుకుంటా ఉంటే శాశ్వతంగా అదుపులో ఉంచుకోవచ్చనీ రాశారు. కానీ ఊగులోడికి ఫిట్స్ అనే మాటే భయం పుట్టిస్తంది. భరించరానిదిగా ఉంది. ఎల్లకాలం మందులు వాడుకుంటా ఉండాల్సిరావటమనే ఊహే నచ్చట్లేదు. 'ఎక్కడికి పోవాలన్నా ఎవరో ఒకరు తోడుండాలి గదా' అని అనుకుంటంటేనే ఏడుపొస్తంది. ఊగులోడి కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. 'మళ్ళీ మొన్నట్లాగే కళ్ళు కనబడ్డం లేదు నాకు' అన్నాడు. ''ఏం లేదులే.. నువ్వు భయపడుతున్నావ్..కళ్ళు తుడుచుకో'' అంటూ వాడిని దగ్గరకు తీసుకుని మంచం మీద కూర్చోబెట్టి మంచినీళ్ళు తెచ్చిచ్చింది. తాగాడు.

అప్పటికప్పుడే ఆసుపత్రికి ఒంగోలు బయల్దేరారు. ఒంగోలులో ముందు తమకు తెలిసిన తమ ఊరి డాక్టరొకాయనుంటే ఆయన దగ్గరకి పోయారు. ఆయన ముక్కు, చెవులు, గొంతు డాక్టరు. ఆయనొక పిచ్చిమారాజు. హైస్కూలు పిలకాయలకందరికీ ఊరకనే వైద్యం చేస్తాడు. ఎడాపెడా టెస్టులేమీ రాయడు. 'మనూరి డాక్టరు గదా. ఫిట్సు డాక్టరు ఎవరికయినా చెప్పి తక్కువ ఖర్చుతో చూపిస్తాడేమో. టెస్టు చేపిచ్చుకుంటే అటో ఇటో తేలిపోద్ది' అనుకున్నాడు ఊగులోడు.

ఆయన ఆప్యాయంగా పలకరించి అంతా విని ''ఏం ఉండదులే..నీరసం వల్ల కళ్ళు తిరిగుంటయ్యంతే'' అన్నాడు. ''ఒక్కసారి నరాల డాక్టరు దగ్గరికి పోయిటెస్టు చేయించుకుంటే మంచిదేమోనని వచ్చామన్నా'' ''ఎందుకూ.. ఏం పన్లేదా ఏంది? ఇదిగో, ఈ బిళ్ళలు ఒక పదిరోజుల పాటు ఏసుకుంటా బలమైన తిండి తింటే చాలు. నేను గూడా మనూరికే వస్తన్నా. నా కారులో పోదాం రాండి'' అని ఎంబట బెట్టుకుని ఊరికి తీసుకుపోయాడు.

ఊగులోడికి ఒక రకంగా సంతోషంగా ఉంది. ఒకరకంగా అసంతృప్తిగా ఉంది. 'అంతలావు డాక్టరు అంతధైర్యం చెబుతున్నాడంటే అంతే




కవిత

## సె(హె)ల్ ఫోన్

ఎవ్వరి చేతుల్లో చూసినా ఓ మొబైల్
ఎక్కడ విన్నా ట్రింగ్ ట్రింగ్ ఫోన్ బెల్
ఆ మాటల గలగలల్, నవ్వుల కిలకిలల్
చూసి చూసి ఇష్టపడి నేనూ కొన్నానో 'సెల్'
ఛాట్ చేస్తూ తీర్చుకోవాలని, నా సరదాల్...
సెల్‌ఫోన్ ఓనర్‌నని గర్వంగా ఇచ్చానో స్మైల్
ఆ ఫీల్‌తో వచ్చేసిందో గొప్ప స్టైల్
ఆహా, సెల్‌ఫోన్ వల్ల ఎంత మేల్ మేల్,
ఎక్కడ నుంచైనా మాట్లాడుకోవచ్చు బోలెడు వీల్!
ఉప్పొంగి పోయింది దిల్,
మది నిండా సంతోష తరంగాల్!
మెల్లగా మొదలాయె, కష్టాల్...
బ్యాటరీ పొడై సెల్‌కి వచ్చాయి తిప్పల్!
రిపేర్లకు తిరిగేసరికి పోయి వచ్చాయి ప్రాణాల్!
ఇప్పుడేమో ఇంటిలోపల రావటమే లేదు, సిగ్నల్
ఆరు బయటనే చేయగలం ఫోన్‌కాల్!
ప్రతీ రోజూ మర్చిపోక విధిగా రెండు గంటల్!
ఛార్జి చేసి తీరాలి, అది రూల్!
చల్లగా వచ్చింది మంత్లీ బిల్
అంతే, నా ముఖంలో ఆనందం నిల్!
అవుట్ గోయింగ్, కాలర్ ఐడీ ఖర్చుల్
ఎయిర్ టైమింగ్ ఛార్జీల్ కలిసి టోటల్
ఏడుస్తూ చెల్లించానో వేయి రూపాయల్!
అబ్బబ్బా! ఇది కాదు మరి, ''సెల్‌ఫోన్''
సందేహ మెందుకూ, ఇది ''హెల్‌ఫోన్!''

-కరుణ

సెల్: **98499 89201**

అయుండాల. ఈ టెస్టులనీ, ఈ టెస్టులనీ డబ్బులొదిలించుకోలేదు, ఇంకా నయం' అని సంతోషం. 'ఎదవ డబ్బులు, పోతే పోయినియ్.. టెస్టు చేయించుకోనుంటే అనుమానం తీరిపోయి మనసుకి శాంతిగుండేది గదా' అని అసంతృప్తి.

ఆ సాయంత్రం పంచాయతీ అరుగు మీద కూర్చోనున్నప్పుడు ఊళ్ళో ఎలిమెంట్రీ స్కూల్లో పని చేసే 'మారుతీసారు' పలకరించాడు. ''బాగలేదంట గదా. ఏంది సంగతి?'' అన్నాడు. ఊగులోడు కతంతా చెప్పాడు. అంతావిని ''ఒకసారి గుంటూరుపోయి మంచి 'న్యూరాలజిస్ట్'ని కలిస్తే ఎందుకైనా మంచిదేమో, కరెంటు వైరుల్లో కనెక్షన్ లూజయినప్పుడు లైట్లు ఆరిపోయి వచ్చినట్లే.. తలలో నరాల్లో ఏదైనా లూజు కనెక్షనుండి అప్పుడప్పుడు నీకు ఏమీ కనపడకుండా ఉంటుందేమో'' అన్నాడు. దెబ్బకి చచ్చాడు ఊగులోడు. మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టయింది.

అసలే ఒక అనుమానంతోనే సతమతమవతంటే తల్లో ఏదో నరాల జబ్బేమో అని కొత్త డౌటు రేగిందిప్పుడు. ఆ సారు చెప్పిన ఉదాహరణ గుర్తొచ్చినప్పుడల్లా ఈ కొత్త డౌటు కూడా నిజయమ్యే అవకాశం బాగా ఎక్కువగానే ఉన్నట్లు కనపడతంది. 'ఎంతైనా మాస్టారు గదా. సరిగ్గా సరిపొయ్యే ఉదాహరణతో బలే అర్థమయ్యేట్టు చెప్పాడు' అనుకున్నాడు.

ఆ పూట పొద్దు పోయిందాకా ఆ అరుగుమీదే గమ్మున కూర్చోనుండిపోయాడు. మళ్ళీ మళ్ళీ వచ్చి వాలే చీకటీగల్లాగా రకరకాల ఆలోచనలు మనసులో ముసురుకుంటున్నయ్. అట్లానే కూర్చోని కూర్చోని ఎప్పటికో లేచి కొంపకి చేరాడు. ''రేపు పొద్దున్నే బయల్దేరి గుంటూరు పొయొస్తా. 'వనితా సూపర్ స్పెషాల్టీస్'లో అన్ని టెస్టులూ బాగా చేస్తారంట. మారుతీ సార్ చెప్పాడు''

***

స్టేషన్‌లో రైలుదిగి ఆటో ఎక్కి ఆసుపత్రికి చేరుకున్నాడు. 'వనితా సూపర్ స్పెషాల్టీస్' బోర్డు చదివాడు. రకరకాల రోగాల పేర్లు, వాటికెదురుగా డాక్టర్ల పేర్లు. ఆ రోగాల్లో సగానికి పైగా పేర్లు తనకు తెలియనివే. మెట్లెక్కి లోపలకొచ్చాడు. 'పర్లేదు, రద్దీ తక్కువగానే ఉంది' అనుకున్నాడు. ''ఓ.పి.లు రాసేది ఎక్కడ సార్?'' ఎవర్నో అడిగాడు. ''ఇక్కడ ఓ.పీ.లు రాయరు. ఇది కేవలం పరీక్షలు చేసే బిల్డింగే. అదుగో, ఆ ఎదురుగా ఉంది. అదీ అసలు హాస్పటల్.''

అక్కడికి వెళ్ళిన ఊగులోడు ఆ మెట్ల దగ్గర అట్లానే నిలబడిపోయాడు నోరు తెరుచుకోని. తాను దిగొచ్చిన రైల్వే స్టేషను కంటే కూడా ఈ ఆసుపత్రే ఎక్కువ హడావుడిగా ఉంది. ఆ జనం మామూలుగా లేరు. 'కొలుపులప్పుడు, తిరునాళ్ళప్పుడు కూడా మనూళ్ళో ఇంత రద్దీగా ఉండదేమో' అనుకున్నాడు.

వొచ్చేవాళ్ళు, పొయ్యేవాళ్ళు, మూలిగేవాళ్ళు, ముక్కేవాళ్ళు, కుర్చీల్లో కూర్చుని టి.వీ.లు చూసేవాళ్ళు, నడవలేకుండా ఉన్నవాళ్ళని చక్రాల మంచాల మీద పొణుకోబెట్టుకోని తోసుకుపొయ్యేవాళ్ళు.. –మెల్లగా అడుగులు ముందుకేశాడు. ఎటువెళ్ళాలో, ఎక్కడ 'ఓ.పీ.' రాస్తారో ఏమీ అర్థమవలేదు. 'ఎనక్కి తిరిగి చూడకుండా ఇట్నించిటే పారిపోదామా?' అనిపించిందొక్కక్షణం.

కొంచెం స్థిమితపడి ఒక అద్దాల కౌంటరు దగ్గరకెళ్ళి ''ఓ.పీలు రాసేదెక్కడండీ?'' అనడిగాడు. ఆ అద్దాల వెనకాల కంప్యూటర్ ముందు కూర్చోనున్న అమ్మాయి కంప్యూటర్ మీంచి చూపు తిప్పకుండానే అడిగింది. ''ఏం కంప్లయింటు?'' ''లూజు కనెక్షన్'' అప్రయత్నంగా అనేసాడు మారుతీసారు మాటలు మనసులో తల్చుకుంటున్న ఊగులోడు. ''ఆc...?'' ఇప్పుడు తలెత్తిందా అమ్మాయి. ''నరాల డాక్టరుని కలవాలమ్మా?'' ''అయితే ఇక్కడే. రెండు వందల రూపాయలివ్వండి'' ఇచ్చాడు. పేరు, ఊరు, వయసు కంప్యూటర్లో రాసుకుంది.

'నాకు కార్డేమీ ఇవ్వలేదు' గుర్తు చేశాడు. ''అదిగో, ఆ పదమూడో నంబరు గదిముందుకెళ్ళి కూర్చోండి. మీ ఫైలు అక్కడికే తీసుకొచ్చి ఇస్తారు. ''నా నంబరెంతమ్మా?'' అని అడిగాడు. ''యాభై రెండు' వామ్మో! 51 మంది అయిపొయ్యేదెప్పుడు.. నా వంతు వచ్చేదెప్పుడు.. సరే, కానియ్ – రోట్లో తలపెట్టినాక రోకలి పోటుకి భయపడితే ఎట్లా'' అనుకొని పదమూడో నంబరు రూము దేవులాడుకుంటూ బయల్దేరాడు.

కొంచెం ముందుకెళ్ళి కుడివైపు తిరిగింతర్వాత కనపడిందారూము. తలుపుమీద 'డా. పి. మమత, న్యూరాలజిస్ట్' అని బోర్డు రాసుంది. రూం ఎదురుగ్గా ఉన్న కుర్చీలన్నీ నిండిపోయున్నాయ్. ఎత్తుగా అమర్చి ఉన్న టి.వీలో 'రబ్బరు గాజులు రబ్బరు గాజులు' అని పాట వస్తంది. అసలు ఆసుపత్రుల్లో టి.వీలెందుకో ఊగులోడికర్థంకాదు. ఇక్కడ కొచ్చేది బాధలతో ఉన్నవాళ్ళు గదా.. ఇక్కడ ఇట్లా టి.వి.లు పెట్టుకుని వాటిల్లో పాటలు, సినిమాలు చూసుకుంటా నర్సులు కూర్చోనుంటే 'మీ చావు మీరు చావండి. మాకేంది?' అని అంటన్నట్లే అనిపించదూ?

అవతలోళ్ళు పట్టించుకోటల్లేదని తెలిసినప్పుడు బాధలు భయాలు ఇంకా ఎక్కువగా అనిపిస్తాయి గదా కష్టాల్లో ఉన్నవాళ్ళకి!

కూర్చోడానికి లేకపోయేసరికి అక్కడే అటూ ఇటూ తిరిగి చూస్తున్నాడు. ఒక పక్కన పెద్ద 'వెంకటేశ్వరస్వామి' బొమ్మ పెట్టి ఉంది. ఊగులోడు దణ్ణం పెట్టుకున్నాడు. అన్ని పరీక్షల్లో తనకు ఏ జబ్బూ లేదనే రావాలని, అట్లాగొస్తే కొండకొచ్చి గుండు కొట్టించుకుంటానని మనసులోనే మొక్కుకున్నాడు. మళ్ళీ అంతలో 'అసలు ఆసుపత్రుల్లో దేవుడి బొమ్మలు పెట్టడమేందా' అనుకున్నాడు. ఆలోచిస్తా ఉంటే అసలు కారణం



## ప్రియమణికి పౌరుషం, పొగరు రెండూ ఎక్కువే!

నాగార్జున పక్కన అనుష్క, ప్రియమణి నటిస్తున్న సంగతి తెలిసిందే! అందం, హైటు విషయంలో అనుష్క ప్రియమణి కన్నా కొద్దిగా ఎక్కువే అన్న సంగతి అందరూ అంగీకరించేదే! అయితే హీరోయిన్లలో తానే అందగత్తెనన్న ఫీలింగ్ ప్రియమణికి కాస్త ఎక్కువట! అది ఈ సినిమాలో పూర్తిగా బయట పడిందని అంటున్నారు. ఆ సినిమాలో ప్రియమణి కన్నా అనుష్క బాగా చేస్తోందన్న టాక్ ఆల్‌రెడీ వచ్చేసింది. దీనికి తెగ పౌరుషపడిపోయిన ప్రియమణి అందాల ఆరబోతలో రెచ్చిపోయిందట! అంతే కాకుండా అనుష్కతో మాటలు కూడా బంద్ చేసిందట! ఈ సినిమా ప్రారంభం కాక ముందు ఇద్దరూ మంచి ఫ్రెండ్స్‌గా ఉండేవారట! ఈ సినిమాతో వీరి మధ్య గొడవలు ప్రారంభం అయ్యాయని అంటున్నారు. పాపం అనుష్క మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా ప్రియమణితో ఫ్రెండ్లీగానే ఉంటోందట!

తట్టింది. వైద్యం ఫలించి జబ్బు తగ్గితేనేమో తామే దేవుళ్ళమనొచ్చు. తగ్గకపోతే మాత్రం 'మాదేముంది, అదుగో, అంతా ఆ దేవుడి లీల' అనొచ్చు. అక్కడ అడుగు పెట్టినదగ్గర నుంచీ ఊగులోడిలో కలుగుతున్న అసహనం ఈ ఆలోచనలతో ఇంకా ఎక్కువవడం మొదలు పెట్టింది.

అంతలో ఒక నర్సొచ్చి తనపేరు పిలిచింది. వెళితే ఊరంత వెడల్పున్న ఒక ఫైలు చేతిలో పెట్టింది. అంతలావు ఫైలు తన చేతుల్లో చూసినాక తనకేమీ రోగం లేదని చెప్పినా కూడా ఊళ్ళో ఎవరూ నమ్మరేమో అనుకున్నాడు. చేంతాడంత రోగాల జాబితా రాసినా కూడా ఆ ఫైల్లో ఇంకా చోటు మిగిలే ఉంటుందనిపించింది.

నంబర్లవారీగా రూంలోకి పిలుస్తున్నారు. ముగ్గురై పోయారు. తన నెంబరొచ్చే సరికి ఎట్టలేదన్నా మజ్జానమయిద్దని లెక్కేసుకున్నాడు. గోడలు, గోడల మీద బోర్డులు అన్నీ చూడ్డం మొదలు పెట్టాడు. పదమూడో నంబరు రూం గోడ బయట ఒక బోర్డు పెట్టి ఉంది. 'ఐన్‌స్టీన్, న్యూటన్, అలెగ్జాండర్-వీళ్ళంతా తమకున్న మూర్ఛరోగాన్ని జయించిన వాళ్ళే. మందుల బలం కంటే మానసిక బలంతో వాళ్ళు దాన్ని సాధించారు.'

'తనకే అట్లాంటి పరిస్థితొస్తే తను మానసిక బలం చూపించగలడా? అంత మానసిక బలమే ఉంటే అసలు ఇప్పుడిక్కడికి రానేరాడేమో! పెద్దగా రోగం లక్షణాలేమీ కనపడకపోయినా లేనిపోని అనుమానాలు పెట్టుకుని వొచ్చాడేమో! ఇప్పుడైనా ఏం పోయింది. పోతే పోయింది రెండొందలు. ఇంటికెళ్తే...' కాసేపు మనసు అటూ ఇటూ ఊగిసలాడింది. అంతలోకి మారుతీసార్ గుర్తొచ్చాడు. ఆయనన్నట్టు లూజుకనెక్షనై, నయం చేయించుకోవడం ఆలస్యమయితే సీరియస్సయిపోద్దేమోననిపించింది. 'సరే, కానియ్' అనుకున్నాడు. భార్యని తోడు తెచ్చుకోకుండా ఒక్కడే రావడం పొరపాటయిపోయిందని చింతించాడు.

కొంచెం అలా వరండా చివరికి నడిచాడు. అక్కడ గోడకి నిలువెత్తు ఫోటో పెట్టి ఉంది. 'డాక్టరోళ్ళ నాన్నేమో!' ఆ ఫోటో కింద రాసుంది. "స్వాతంత్ర్య సమర యోధులు, తామ్రపత్ర గ్రహీత, ప్రముఖ కాంట్రాక్టరు శ్రీ డా.వంగవరపు వెంకటరామారావు". 'స్వాతంత్ర్య సమర యోధుడు మరి కాంట్రాక్టరెట్లా అయ్యాడో..! ఆ రోజుల్లో మంచోళ్ళు కూడా కాంట్రాక్టులు చేస్తుండేవాళ్ళేమో!'

***

'నంబర్ 50' నర్సు పిలిచింది. ఇంకో రెండు పేర్లు అయిపోతే తనదొస్తుంది. తలుపు తీసేటపుడు, వేసేటపుడు లోపల్నుంచి కుర్ర డాక్టరొకాయన కనబడుతున్నాడు. 'డాక్టర్ మమత దగ్గర చూయించుకోవాలని గదా తను ఓ.పీ.రాయించుకుంది, వీడెవడు?' అని అనుమానమొచ్చింది. ఆ విషయమే వాకిలి దగ్గర పీట మీద కూర్చున్న నర్సుని అడిగితే ఆమె చెప్పింది. "ముందు ఈ చిన్న డాక్టరు చూస్తారు. చూసి ఏమేం టెస్టులు చేయించుకోవాలో రాసిస్తారు. వెళ్ళి ఆ టెస్టులు చేయించుకొనొచ్చాక అప్పుడు పెద్ద డాక్టరమ్మగారు చూస్తారు."

అంతలో లోపలకి పిలుపొచ్చింది. వెళ్ళాడు. "ఆc... ఆఖరుసారి ఎప్పుడు ఎటాక్ కనబడింది?" అనడిగాడు డాక్టరు. "అసలు తనకొచ్చింది ఎటాకో, కాదో తెల్సుకొవాలనొస్తే ఎప్పుడు ఎటాకని అడుగుతాడేందిరా ఈడు?" అనుకున్నాడు ఊగులోడు. మొత్తం జరిగిందంతా చెప్పాడు. అనుమానం మీద వచ్చానన్నాడు. ఆ డాక్టరు ఊc అన్లేదు, ఆc అన్లేదు... అర్థమేందో తెలియకుండా తలూపాడు. పేపరొకటి తీసుకుని బరా బరా ఏదో గీకాడు.

కాగితం చేతిలో పెట్టి 'నెక్స్ట్' అంటూ బెల్లు కొట్టాడు. "ఏంది సార్ ఏం కాయితం, ఏం చెయ్యాలి నేనిప్పుడు?" అని అడిగాడు ఊగులోడు. "బయట నర్సు చెప్తుంది. పోండి" అన్నాడు. బయటకొస్తే ఆమె చెప్పింది. "11వ నంబరు కౌంటరు దగ్గరికి పోయి ఈ కాయితం ఇవ్వండి. వాళ్ళు ఎంత డబ్బులివ్వాలో చెబుతారు. డబ్బులిచ్చేసి రశీదు తీసుకోండి." 'అది ఏం కాయితం ? ఆ కౌంటరెక్కడుంది' అని అడగబోతున్నంతలోనే ఆమె హడావుడిగా లోపలకు పోయింది.

చిన్నప్పుడు సింగరకొండ తిరనాల్లో తప్పిపోయినప్పుడు ఎట్లా అనిపించిందో ఇప్పుడూ అట్లానే అనిపిస్తుంది ఊగులోడికి. ఆ వరండాలో ఇట్నుంచి అటు ఎక్కడ చూసినా 11వ నెంబరు కౌంటరు కనబడలేదు. ఇదంతా చూస్తున్న ఒకాయన ఆ కౌంటరు పై అంతస్తులో ఉంది, పొమ్మని చెప్పాడు. మెట్లెక్కి పైకెళ్ళాడు. 'ఇన్వెస్టిగేషన్ బిల్లింగ్ కౌంటర్' అని ఎర్రక్షరాలతో రాసిన బోర్డుందక్కడ. ఆ కౌంటరు దగ్గర చేంతాడంత 'క్యూ'లు రెండున్నాయి. క్యూలో నిలబడి తన ముందున్నాయన్ని అడిగాడు. "ఈ కాయితంలో రాసినయ్యేంట"ని. "మనం చేయించుకోవాల్సిన టెస్టులండీ. ఈ టెస్టుల తాలుకు బిల్లు ఇక్కడ కట్టేసి ఆ ఎదురుగ్గా ఉన్న బిల్డింగులోకెళ్తే అక్కడ టెస్టులు చేస్తారు" ఈ విషయం రూంలోకి వెళ్ళక ముందే తనకు నర్సు చెప్పింది గదా అని అప్పుడు గుర్తుకొచ్చింది.

క్యూ మహా రద్దీగా ఉంది. ఊగులోడి మనసు అంతకంటే రద్దీగా ఉంది. ఏం టెస్టులు రాశాడో, ఎంత బిల్లవుద్దో అని ఆలోచిస్తున్నాడు. అక్కడ గోడకి రంగు రంగుల బోర్డులు తగిలించున్నాయి. 'వనితా సూపర్ స్పెషాల్టీస్ వారి బంపర్ ఆఫర్.. కంప్లీట్ బాడీ చెకప్.. యాక్చువల్ ధర రు.5,300, కానీ మీ కోసం ప్యాకేజ్ ధర రు.3000 మాత్రమే. కంప్లీట్ కార్డియాక్ చెకప్... అసలు ధర రు.2,290. మీ కోసం తగ్గింపు ధర రు.1000 మాత్రమే. రు.7,500 ఖరీదైన డయాబెటిక్ టోటల్ చెకప్ ఇప్పుడు భారీ డిస్కౌంటుతో రు.5000 మాత్రమే'

ఈ బోర్డులు చూసిన ఊగులోడికి మతిపోయింది. మేదరమెట్ల బస్టాండు ముందు చక్రాల బండి పెట్టుకుని "ఏ వస్తువైనా పది రూపాయలే' అని అరిచే మస్తాను గుర్తొచ్చాడు. 'ఈ చెకప్పులేందీ... ఈ ధరలేందీ... ఈ డిస్కౌంట్‌లేందీ.. ఊగులోడికి ఆ ఆస్పత్రి బందిపోటు దొంగల హెడ్డాఫీసులాగా కనపడసాగింది.

కౌంటర్‌లో కంప్యూటర్ ముందు కూర్చున్న అమ్మాయి ఊపిరాడకుండా పనిచేస్తోంది. డబ్బులు కట్టలు కట్టలు తీసుకుని సొరుగులో



కవిత

## మళ్ళీ ముగింపు నుండి...

రోజూ వెళ్తున్న దారిలో
ఉండాల్సినదేదో కనుమరుగైన అనుభవం
నరికి వేయబడ్డ బొప్పాయి చెట్టు ఆనవాలు
దేహం నిండా తీయగా సంచరిస్తోంది
అక్కడో గోడ మీద
బొమ్మలు నృత్యాలు చేసేవి
వాటికి రూపాన్ని ప్రసాదించిన చేతులు
పిచ్చితనంతో వీధంతా కలియదిరిగి
అకస్మాత్తుగా దేహాన్ని మట్టికి కట్టబెట్టాయి
ఎప్పుడూ స్పందించని హృదయాలు సైతం
పాడె నెత్తుకోవడానికి భుజాలనివ్వడం చూసి
నింగి తన జలదేహంతో దిగివచ్చి
మానవతను కావలించుకుంది...
నిలువెత్తు పాటై నలుదెసల్నీ పలుకరించే తుంబురా
ఆ ఇంటి దగ్గర అకస్మాత్తుగా ఆగిపోయింది
తుంబురా తీగలు విచ్ఛిన్నమై
సవాలక్ష గొంతులుగా చెదిరి పోయాయి
పాటగాడ్ని కోల్పోడం గురించి తెలుసుకోవడమంటే
పాట విలువను తలకెత్తుకోవడమే...
అర్థాంతరంగా ఆగిపోవడాన్ని
ఎవరు మాత్రం భరించగలరు...?
గొంతు నిద్రపోతోంది...
ఎక్కడి నుండో ఓ తీయని స్వరం మాత్రం
అవిచ్ఛిన్నంగా మేల్కొల్పుతూనే ఉంది.

-పాయల మురళీకృష్ణ

పెట్టుకుంటంది. టకటకా రశీదులు కొట్టిస్తంది. అయినా ఆ వేగం సరిపోవట్లేదు. ముగ్గురు నలుగురు తోసుకోనొచ్చి ఒకేసారి కౌంటరు రంధ్రంలో చేతులు పెట్టిరు. నా డబ్బులు ముందు తీసుకో మంటే నావి ముందు తీసుకోమని గొడవ పెడుతున్నారు.

ముందు నన్ను దోచుకోమంటే ముందు నన్ను దోచుకోండని బతిమలాడుకుంటన్నట్టుగా ఉంది. ఇంతలో కౌంటర్లోని అమ్మాయి గట్టిగా ఒక్క కసురు కసిరింది. ''లైన్లో రాండయ్యా, లైన్లో వస్తేనే దోచుకునేది. ముందొచ్చినోళ్ళనే ముందు దోచుకుంటాం. వెనకొచ్చినోళ్ళను ముందు దోచుకోమంటే ఎట్లా కుదురుద్ది? అని కోప్పడుతున్నట్లుగా ఉంది.

ఊగులోడి వంతు వచ్చింది. ''3906 రూపాయలివ్వండి'' అందామె అతని చేతిలోని కాయితం చూసి. డబ్బులిచ్చి రశీదు తీసుకుని బయటకొచ్చి ఎదురుగ్గా ఉన్న టెస్టులు చేసే బిల్డింగ్ లోకి పరుగెత్తుకెళ్ళాడు.

అక్కడా జనం తిరనాలగానే ఉన్నారు. ఏ టెస్టు ఎక్కడ చేస్తారో, ఎవరెటు వెళ్ళాలో చెప్పేవాళ్ళెవరూ లేరు. ఎందుకు లేరో ఊగులోడికర్థమయింది. ముందుగానే కట్టించేసుకున్నారు కాబట్టి వాళ్ళకి బాధేమీ లేదు. తాపీగా ఉన్నారు. డబ్బులు కట్టేశారు కాబట్టి టెస్టులు చేయించుకోవాల్సిన జనానికి ఆదుర్దా.

ఎట్లాగో కనుక్కుని టెస్టులు చేసే దగ్గరకు పోయాడు. రక్తపరీక్షకు రక్తమిచ్చాడు. ఒంటేలు పరీక్షకు బుడ్డి తీసుకోనిపోయి నింపుకోనొచ్చాడు. తలస్కానింగ్ తీసే రూము దగ్గరకొచ్చాడు. అక్కడెవ్వరూ లేరు. 'వీళ్ళెప్పుడొస్తారు' అని ఎవర్నడిగినా ఎవరూ ఏమీ చెప్పట్లేదు. ఏం జెయ్యాలో అర్థం కాక అటూ ఇటూ తిరుగుతుంటే 'అంతలోకి ఆ ఇ.ఇ.జి. పరీక్ష చేయించుకొని రాండి' అని చెప్పాడు రక్త పరీక్ష కౌంటరులో కూర్చున్న అబ్బాయి.

ఆ పరీక్ష చేసే గది కింద అండర్ గ్రౌండ్‌లో ఉంది. మెట్లు దిగి కిందికెళ్ళాడు. ఆ గది బయట బెంచీమీద అప్పటికే నలుగురు కూర్చుని ఉన్నారు. వెళ్ళి పక్కనే కూర్చున్నాడు. 'తలకపోసుకున్నావా?' అని అడిగాడు పక్కన కూచున్నాయన. ''పోసుకోలా'', నూనె రాసుకున్న తలను తడుముకుంటూ చెప్పాడు ఊగులోడు. ''ఈ పరీక్ష చెయ్యాలంటే తలలో జిడ్డుండకూడదంట. అదిగో, ఆ పక్కన బాత్రూముల దగ్గర ఆయా ఉంటది. ఎంటికల మటికి షాంపూతో కడుగ్గి పో'' అని చెప్పాడు.

బాత్రూముల కల్లి పోయే సరికి ఆయమ్మ ఎదురొచ్చింది. ''ఏందయ్యా తలకపోయాల్నా?'' అంది. ఆమెను చూస్తే ఊగులోడికి ప్రాణం లేచొచ్చింది. ఆ ఆస్పత్రిలో అడుగు పెట్టింతర్వాత

## ఈ బహుమతి చక్కని ప్రేరణ



దీపావళి కథల పోటీలో తృతీయ బహుమతినిచ్చి ప్రోత్సహించిన 'నవ్య వీక్లీ'కి నా హృదయ పూర్వక కృతజ్ఞతలు. కథల పోటీలో పాల్గొనడం నాకు ఇదే తొలిసారి. ఈ బహుమతి నా రచనా వ్యాసంగానికి నిజంగా ఒక చక్కని ప్రేరణ.

ఇక ఈ కథ నేపథ్యంలోకి వస్తే కథా మూలం నాకు స్వయంగా ఎదురైన ఒక అనుభవమే. 'ఆసుపత్రి' అని బోర్డు పెట్టుకున్న వ్యాపార కేంద్రాన్ని చూసి, అక్కడ కాసింత మానవీయ స్పర్శకోసం తహతహలాడుతూ కనిపించిన నాబోటి వాళ్ళ నెందరినో చూసి.... కలిగిన బాధలోంచి, పుట్టిన కన్నీళ్ళలోంచి రాసిన కథే ఈ 'ఊగులోడు'. ఈ కథలో కనిపించే 'ఆయమ్మ' నాకు చాలా ఇష్టమైన పాత్ర.

నా ప్రాణమంతా తామే అయిన నా శ్రీమతి శ్రీదేవి, పాప అమృతలకు ఒక సరైన దృక్పథాన్ని నాకందించిన పుస్తకాలను పరిచయం చేసి... రాయడానికి నన్ను ప్రోత్సహించిన కరుణ, రవి, మంచికంటిలకు, సాహిత్య వాతావరణంతో సదా టచ్‌లో ఉండేందుకు ఉపకరిస్తోన్న 'అద్దంకి సృజన' కు – ఈ సందర్భంగా మనస్ఫూర్తిగా నా కృతజ్ఞతలు. కథ రాసేందుకు పరోక్షంగా నన్ను ఒత్తిడిచేసిన 'ఒంగోలు విరసం వర్క్ షాప్'కు ప్రత్యేక ధన్యవాదాలు.

**–ఆర్.రాఘవరెడ్డి**
*సెల్: 94923 16036*

'ఫలానా పని కావాలా, అని దయగా అడిగిన మొట్టమొదటి మనిషి ఆమే!

తలకపోసుకోనొచ్చి పరీక్ష చేసే గది బయట కూర్చోని ఆరబెట్టుకున్నాడు. ఒక గంటకి తన వంతొచ్చింది. తలంతా ఏదో బంకలాంటిది పూసి క్లిప్పులు పెట్టి ఒక అరగంటసేపు ఏదో మిషను కింద పడుకోబెట్టారు. ఒక రిపోర్టు ఇచ్చారు. అది ఒక పెద్ద పుస్తకం లాగా ఉంది. పేజీల నిండా ఏంటియ్యో ఎగుడుదిగుడు గీతలే.

తలకి పూసిన బంక పోవాలంటే మళ్ళీ షాంపూతో కడుక్కోవాల్సిందేనని చెప్పారు. ఆయమ్మ సాయంతో తల శుభ్రంగా కడుక్కున్నాడు. '' ఒక పది రూపాయలియ్యెయ్యా..'' అనడిగిందామె. 20 రూపాయలు తీసి ఆమె చేతిలో పెట్టి మెట్లెక్కి పైకొచ్చాడు. తల స్కానింగ్ చేయించుకుని ఆ రిపోర్టు కూడా తీసుకున్నాడు. అక్కడ కూడా ఏదో పెద్ద యంత్రం కింద పడుకోబెట్టారు. అలా పడుకున్నప్పుడు పై నుంచి మిషనేదో దిగుతుంటే.. ఏ భూతమో వచ్చి గుండెల మీద కూర్చుని నొక్కేస్తున్నట్లుగా ఉంది ఊగులోడికి.

పరధ్యానంగానే రిపోర్టులన్నీ తీసుకుని మెయిన్ ఆసుపత్రిలోనికొచ్చాడు. పదమూడో నంబరు గది ముందుకొచ్చాడు. తనలాగే పొద్దున చిన్న డాక్టరుకి చూయించుకుని టెస్టులన్నీ చేయించుకోనొచ్చి పెద్ద డాక్టరు గారి పిలుపు కోసం ఎదురు చూస్తున్నారందరూ. ఒక కుర్చీ ఖాళీగా కనబడ్డంతో దాంట్లో కూలబడ్డాడు.

ఊగులోడి మనసంతా గందరగోళంగా ఉంది. తను అనవసరంగా తొందరపడి వచ్చాడేమో అని పదే పదే అనిపించసాగింది. రిపోర్టులన్నీ చూసి ఏం చెబుతారో అని భయం వేస్తంది. 'ఏమీ లేకపోయినా ఏదో రోగముందని చెబుతారేమో. ఎట్లారా నాయనా' అనుకుంటున్నాడు. 'ఇక్కడ కాలుపెట్టిందగ్గర్నించి ఎటు చూసినా వ్యాపారమే గదా కనపడింది' అని మాటిమాటికీ అనుకుంటన్నాడు.

'ఈ రిపోర్టులన్నీ తీసుకుపోయి ఇంకో డాక్టరు దగ్గర చూయించుకుంటేనో...' తనమీద తనకే కోపమొచ్చింది ఊగులోడికి. అసలు తనకేమయిందని ఈ చెకప్పులూ గికప్పులూ. ఆ బడిపంతులు చెప్పటమూ సరే, తను దడుచుకోని చావటమూ సరే. 'ఛ... నువ్వొట్టి అనుమానపు నా కొడుకువిరా' అని తనను తానే తిట్టుకున్నాడు.

పక్క కుర్చీలో కూర్చున్నాయన ఆ పక్కనాయనతో చెప్తున్న మాటలు చెవుల్లో పడుతున్నాయ్. ''దొంగనాయాళ్ళు! తగ్గుద్దని చెప్పి జాయిన్ చేసుకున్నారు. నెల రోజుల్నుంచీ రోజుకి మూడు వేల రూపాయల కాడికి బిల్లు వేసి తీరా ఇప్పుడు 'లాభం లేదు, తీసుకెళ్ళిపోండి' అంటన్నారు. 'మనం ఏం చేసినా ఇంకో నెల రోజుల కంటే బతకడు' అని ఊళ్ళో ఎమ్బీబియ్యెస్ డాక్టరు చెబితే వినకుండా ఇక్కడికి తీసుకొచ్చి నిలువునా మోసపోయాం''

ఊగులోడి బుర్ర గిర్రున తిరిగిపోతంది. 'ఒకేల ఆ రిపోర్టుల్లో నిజంగానే తన తలలో ఏదో తేడా ఉందనొస్తే...?' 99 పాళ్ళు ఏ తేడా ఉండదనే అనిపిస్తంది. ఒక పాలు అట్టాంటిదేమైనా ఉంటే కనపడకుండా ఏం ఉండదు గదా. అప్పుడే చూసుకోవచ్చు. అసలు పక్కనే ఉన్న మేదరమెట్లకి పోయి మామూలు డాక్టరుకి చూయించుకోకుండా ఈ 'సంతానుపత్రి'కి రావడమే పెద్ద తప్పు.

''నెంబరు 50'' రూము బయటకొచ్చి నర్సు పిలుస్తా ఉంది. ఇంకో రెండు నంబర్లు పిలిస్తే తన వంతొస్తుందనగా ఊగులోడు మెల్లగా లేచాడు. సంచి తీసుకోని మెట్లు దిగి బయటకొచ్చి ఆటో ఎక్కాడు. స్టేషనుకొచ్చి ఊరెళ్ళే రైలెక్కాడు.

*